సాక్షి
మెదక్
శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



అభాగ్యులకు అండగా..

తల్లిదండ్రులు లేని చిన్నారులకు సాయం అందించే 'మిషన్ వాత్సల్య' పథకానికి మెదక్ నుంచి భారీగా దరఖాస్తులు చేసుకున్నారు.

వివరాలు 8లో ▸



అప్పులు చేసి మధ్యాహ్నం వంట

మధ్యాహ్న భోజన కార్మికులకు సకాలంలో బిల్లులు రాక అప్పులు చేసి వంటలు చేస్తున్నారని సీఐటీయూ నాయకులు ఆరోపించారు.

వివరాలు 8లో ▸



వైభవంగా శోభాయాత్ర

గణేశ్ నవరాత్రుల ఉత్సవాలు ముగింపు సందర్భంగా మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేసి వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

బగలాముఖీ దేవికి పూజలు



పూజలు చేస్తున్న దేవసేన

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని బగలాముఖీ శక్తిపీఠాన్ని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రతీ ఒక్కరు భక్తిభావంతో ఉండాలని, బగలాముఖీ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.

కష్టపడే వారికి ప్రాధాన్యమివ్వాలి



భట్టి విక్రమార్కతో మాట్లాడుతున్న మండల నాయకులు

నిజాంపేట(మెదక్): కష్టపడేవారికి టికెట్ కేటాయించాలని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కోరారు. గురువారం సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్కను కలిసి స్థానిక నేత కంతారెడ్డి తిరుపతిరెడ్డికి టికెట్ ఇవ్వాలంటూ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీలో కొత్తగా చేరిన వారికి టికెట్ కేటాయిస్తే ఇంత కాలం పార్టీకోసం పనిచేసిన వారి పరిస్థితి ఏంటని అన్నారు. దీనిపై భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అధిష్టానం ఎవరికి ఎలాంటి హామీ ఇవ్వలేదని, పార్టీ కోసం కష్టపడేవారికి తప్పకుండా ఫలితం ఉంటుందని చెప్పినట్లు తెలిసింది. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ మామిళ్ల ఆంజనేయులు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, మండలాల అధ్యక్షులు లింగం గౌడ్, శాంరెడ్డి, శ్రీనివాస్, గోవింద్ నాయక్, రామాయంపేట పట్టణ అధ్యక్షుడు యాదగిరి, శంకర్, శ్యామ్ సుందర్, ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, సుఫీ, మహేష్, నసిరుద్దీన్, పంజా బాబు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ తిరస్కరణ సరికాదు



ఆశ వర్కర్లకు మద్దతు తెలుపుతున్న మల్లేశం

కొల్చారం(నర్సాపూర్): డిమాండ్ల సాధన కోసం ఆశ వర్కర్లు అందించిన సమ్మె నోటీస్‌ను మెడికల్ ఆఫీసర్ తిరస్కరించడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం అన్నారు. మండల కేంద్రంలో ఆశ వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మెకు గురువారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంగంపేట పీహెచ్‌సీ పరిధిలో ఆశ వర్కర్లు సమ్మె నోటీస్ ఇచ్చేందుకు మెడికల్ ఆఫీసర్ వద్దకు వెళితే తిరస్కరించారని, విధుల్లోకి రాకుంటే ఊరుకునేది లేదంటూ బెదిరించినట్లు మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సీఐటీయూ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వంటావార్పుతో నిరసన



వంటావార్పు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మెదక్ కలెక్టరేట్: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం ఉద్యోగులతో కలిసి వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. 18 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమకు కనీస వేతనం అందించి, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రేణుక, వెంకటమ్మ, స్వరూప, శ్యామల, సావిత్రి, ప్రమీల, ఉద్యోగులు పాల్గొన్నారు.

మెదక్ కాంగ్రెస్‌లో.. 'రోహిత్' రగడ

- అసమ్మతి రాగం వినిపిస్తున్న ముఖ్య నాయకులు
- పనిచేసిన వారికి ప్రాధాన్యమివ్వాలన్న కంతారెడ్డి
- వలస నేతలకు ఇవ్వొద్దంటున్న మ్యాడం
- పార్టీ నిర్ణయమే ఫైనల్ అంటున్న సుప్రభాతరావు
- కాక రేపుతున్న మైనంపల్లి చేరిక అంశం



ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మైనంపల్లి

మెదక్/సాక్షిప్రతినిధి సంగారెడ్డి: మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేరిక మెదక్ కాంగ్రెస్ పార్టీలో చిచ్చు రేపుతోంది. మైనంపల్లి హన్మంతరావుతో పాటు, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్‌కు కూడా హస్తం పార్టీ అభ్యర్థిత్వం దాదాపు ఖరారు కావడంతో ఆ పార్టీలోని సీనియర్ నాయకులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కంతారెడ్డి తిరుపతిరెడ్డితో పాటు, పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణలు తమ అసమ్మతి గళాన్ని వినిపించారు. ఇన్నాళ్లు పార్టీ కోసం పనిచేసిన తమను పక్కన బెట్టి వలస వచ్చిన నేతలకు టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. పారాచూట్ నేతలకు ప్రాధాన్యం ఇస్తే.. ఒప్పుకునే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు. మెదక్ టికెట్ కోసం ఈ ఇద్దరితో పాటు, పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు సుప్రభాతరావు దరఖాస్తు చేసుకున్నారు. తెరపైకి మైనంపల్లి రోహిత్ రావడంతో కాంగ్రెస్ నేతలు భగ్గుమంటున్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేశానని, పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు తోడుగా ఉన్నవారిని కాకుండా కొత్తగా చేరిన వారికి ప్రాధాన్యం ఎలా ఇస్తారని డీసీసీ అధ్యక్షుడు కంతారెడ్డి ప్రశ్నిస్తున్నాడు. ఈ మేరకు ఇటీవల మెదక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టికెట్ రాని పక్షంలో కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. మరోవైపు మ్యాడం బాలకృష్ణ కూడా తన అసమ్మతిని వినిపిస్తున్నారు. పదేళ్లుగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా తయారు చేశామని, వలస నేతలకు టికెట్ ఇస్తే తమను అవమానించినట్లే అవుతుందని అంటున్నారు. కాగా పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని సీనియర్ నేత సుప్రభాతరావు స్పష్టం చేసినట్లు సమాచారం. 40 ఏళ్లుగా పార్టీలో ఉంటూ.. ఇప్పటికే పలుమార్లు టికెట్ త్యాగం చేశానని, అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అని తన అనుచరులతో పేర్కొన్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద రోహిత్ రావు చేరిక మెదక్ కాంగ్రెస్‌లో కాక రేపుతోంది.

ముఖ్యనేతలను కలుస్తున్న డీసీసీ..

ఈ టికెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న డీసీసీ అధ్యక్షుడు కంతారెడ్డి తిరుపతిరెడ్డి ఆ పార్టీ ముఖ్యనేతలను కలుస్తున్నారు. ఇప్పటికే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన ఆయన గురువారం ఢిల్లీకి వెళ్లినట్లు సమాచారం. అధిష్టానం పెద్దలను కలిసి అక్కడే తేల్చుకోవాలని నిర్ణయించారు.

రెండు టికెట్లపై...

రెండు టికెట్లపైనా కాంగ్రెస్‌లో రగడ షురువైంది. మైనంపల్లి హన్మంతరావుతో పాటు, ఆయన కుమారుడు రోహిత్‌కు కూడా టికెట్ ఇస్తారని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రకటించడం కాంగ్రెస్‌లో కీలక చర్చకు దారితీసింది. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కు విరుద్ధంగా ఒకే కుటుంబంలో ఇద్దరికి టికెట్ ఎలా కేటాయిస్తారని మెదక్ కాంగ్రెస్ నేతలు అంటున్నారు. రాష్ట్రంలో పలువురు నేతలు తమ కుటుంబ సభ్యులకు కూడా టికెట్ ఇవ్వాలని కోరుతున్నారని, మైనంపల్లికి రెండు టికెట్‌లు ఇస్తే.. మిగతావారికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద మైనంపల్లి కాంగ్రెస్ పార్టీ చేరిక అంశం కాంగ్రెస్ పార్టీలో రాజకీయ వేడిని రాజేసింది.

దుర్గమ్మ పల్లకీసేవ



పల్లకీ సేవలో భక్తులు

పాపన్నపేట(మెదక్): పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం ఏడుపాయలలో నిర్వహించిన దుర్గమ్మ పల్లకీసేవ కార్యక్రమం కనులపండువగా సాగింది. చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి, పూజారులు సాయంత్రం మూల విరాట్‌కు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై ఉంచి దుర్గమ్మ తల్లికి జై అంటూ నినాదాలు చేస్తూ గోకుల్ షెడ్డు వరకు ఊరేగించారు.

అనంత కోటి దీపార్చన



వ్రతంలో పాల్గొన్న భక్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని అనంత పద్మనాభస్వామికి గురువారం భక్తులు అనంత కోటి దీపార్చన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నశంకరంపేట, చేగుంట, నార్సింగి, రామాయంపేట, మాసాయిపేట మండలాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి నిర్వహించిన వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం అనంత కోటి దీపార్చన జరిగించారు. కార్యక్రమంలో శ్రీఅనంతపద్మానాభస్వామి గుట్ట జీవబ్రహ్మైక వేదంత రాజయోగాశ్రమ నిర్వాహకులు శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్, వేదపండితులు సంతోష్‌శర్మ, ఆలయ బాధ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

నిబంధనల మేరకు నిమజ్జనం

- ఎస్పీ రోహిణి ప్రియదర్శిని
- కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ



మాట్లాడుతున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: నిబంధనల మేరకు వినాయక విగ్రహాల నిమజ్జనం నిర్వహించుకోవాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో వినాయక నిమజ్జనం, మిలాదున్ నబీ వేడుకల నిర్వహణపై పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ ఎస్పీ మాట్లాడుతూ.. శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని, కమాండ్ కంట్రోల్ నుంచి నిమజ్జనాన్ని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలన్నారు. ఏ వర్గం వారికైనా ఇబ్బంది కలిగించినట్లు తెలిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేయొద్దని, ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా అభ్యంతరకర పోస్టులు పెట్టొద్దని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నిమజ్జనం సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నపిల్లలను చెరువులో దిగకుండా చూడాలని, నిమజ్జన ప్రదేశంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, లైటింగ్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు ఉంటే 100 లేదా 08452-223533, 8712657888 సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఎస్పీ ఫణింద్ర, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో నేలకు సారం

నర్సాపూర్ రూరల్: సేంద్రియ ఎరువులతో నేలకు సారం అందుతుందని వ్యవసాయ శిక్షణ విద్యార్థులు అన్నారు. మండలంలోని పెద్ద చింతకుంట గ్రామంలో రైతులకు కౌడిపల్లి మండలం తునికి డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విద్యార్థులు గురువారం అవగాహన కల్పించారు. రసాయనాలతో నేలకు జరిగే నష్టాన్ని తెలిపి, జీవన ఎరువులతో కలిగే లాభాలపై గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండె శివకుమార్, ఉప సర్పంచ్ నాగరాజ్, శాస్త్రవేత్త భార్గవి, విద్యార్థులు రేష్మ, తనూష, కావ్య, ఆమని, ఆకాంక్ష, హర్షిని తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన పద్మశాలీ నాయకులు



మంత్రి హరీశ్‌రావుకు పూలమొక్క అందజేస్తున్న పద్మశాలీ నాయకులు

గజ్వేల్: మంత్రి హరీశ్‌రావును గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గజ్వేల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఆ సంఘం నాయకులు కలిశారు. సంఘం భవనం ప్రారంభోత్సవానికి మంత్రిని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజు ఉన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బీచ్‌రోడ్డు(విశాఖపట్నం): విశాఖ బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాకు చెందిన అచ్చిరెడ్డి వెంకటేశ్వరరావు(65) తన కుమార్తె పెళ్లి నిమిత్తం కుటుంబంతో కలిసి విశాఖ వచ్చారు. నగరానికి చెందిన వ్యక్తితో బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో బుధవారం రాత్రి కుమార్తె వివాహం ఘనంగా జరిపించారు. ఆ సమయంలో వెంకటేశ్వరరావుకు గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. తండ్రి మృతిపై అనుమానం ఉన్నట్టు అమెరికాలో ఉంటున్న వెంకటేశ్వరరావు కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పుకార్లు నమ్మొద్దు.. పార్టీ మారడంలేదు

- ఎమ్మెల్యే మదన్‌రెడ్డి స్పష్టీకరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న పుకార్లు నమ్మొద్దని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై, నామినేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు టికెట్ల కేటాయింపు జరుగుతూనే ఉంటుందని, సీఎం కేసీఆర్‌పై నమ్మకం ఉందని, టికెట్ తనకే వస్తుందన్న ఆత్మ విశ్వాసం ఉందని చెప్పారు. కార్యకర్తలెవరు అధైర్యపడొద్దని, రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలుస్తానని వివరించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ సీఎంగా మూడోసారి బాధ్యతలు స్వీకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

తండాల రోడ్లకు నిధులు..

నియోజకవర్గంలోని గిరిజన తండాలకు బీటీ రోడ్ల కోసం రూ.66 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. గతంలో రూ.55 కోట్లతో అన్ని తండాల్లో సీసీ రోడ్లు నిర్మించామని, ప్రస్తుతం తండాలకు బీటీ రోడ్లు వేయిస్తామన్నారు. నియోజకవర్గానికి మూడు వేల గృహలక్ష్మి ఇళ్లు మంజూరయ్యాయని, మరో రెండు వేల ఇళ్లు మంజూరు చేయిస్తానని ఆయన ప్రకటించారు. నర్సాపూర్‌లో అన్ని కుల సంఘాల భవనాలకు స్థలం, నిర్మాణం కోసం సాయం అందిస్తానని, అర్బన్‌పార్కును అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. గిరిజన తండాలకు బీటీ రోడ్ల కోసం నిధులు మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ గిరిజన నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు పార్టీ నుంచి అందించిన బీమా చెక్కులు, బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసంఘటిత కార్మికబోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ మన్సూర్, ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, నాయకులు శేఖర్, అశోక్‌గౌడ్, శ్రీధర్ గుప్తా, శివకుమార్, జితేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, హబీబ్‌ఖాన్, భిక్షపతి, షేక్ హుస్సేన్, మహ్మద్, వెంకట్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, ఇబ్రహీంఖాన్, కృపాచారి తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు భరోసా

సంగారెడ్డి మున్సిపాలిటీ: మహిళలు, బాలికల భద్రతకు భరోసా కేంద్రం పెద్దపీట వేస్తుందని అదనపు ఎస్పీ పి.అశోక్ అన్నారు. జిల్లాలో భరోసా కేంద్రం ప్రారంభమై మూడు వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వేధింపుల నుంచి బయటపడాలంటే మహిళలు మౌనం వీడాలని పిలుపునిచ్చారు. భరోసా కేంద్రం సిబ్బంది సేవలు మరువలేనివని, బాధిత మహిళలను అక్కున చేర్చుకొని, కొండంత అండనిస్తున్నారని కొనియాడారు. సమస్యలతో భరోసా కేంద్రానికి వచ్చిన వారికి నిష్ణాతులతో కౌన్సెలింగ్ ఇప్పించి, ఎంతో మంది బాధితులకు బాధ నుంచి విముక్తి కలిగిస్తున్నారని చెప్పారు. పోక్సో, అత్యాచార కేసుల్లో బాధిత మహిళలకు అన్ని రకాల సేవలు అందేలా ఈ భరోసా కేంద్రం చూస్తుందన్నారు. చివరి వరకు బాధితులకు అండగా ఉంటూ.. నేరస్తులకు శిక్ష పడేలా చేయడమే భరోసా కేంద్రం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీ రమేశ్ కుమార్, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్, సంగారెడ్డి పట్టణ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మహిళ పీఎస్ ఎస్ఐ పూలబాయ్, భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ పార్క్‌పై ప్రయివేట్ అజమాయిషా?

- కాలనీవాసుల నిలదీత
- మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని 11వ వార్డు వెంకట్రావు నగర్ కాలనీలోని మున్సిపల్ పార్క్‌కు తాళం వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పార్క్‌కు కొందరు తమ సొంత స్థలం అన్నట్టు తాళం వేయడం ఏమిటని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి బాధ్యులపై చర్య తీసుకోవాలని, లేదంటే రాందాస్ చౌరస్తా వద్ద ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో విశాల్ రాజు, దాలేవర, శ్రీకాంత్, సౌమిత్, పోలస్, అరవింద్, రోహన్ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న యువకులు

గొల్ల కురుమల సంక్షేమం పట్టని సర్కార్

- సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు మల్లేశం
- రోడ్డుపై గొర్రెలతో వినూత్న నిరసన



రోడ్డుపై గొర్రెలను నిలిపి నిరసన చేస్తున్న గొల్ల కురుమలు

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని జాతీయ గొల్ల కురుమల కాపర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో గురువారం గొల్ల కురుమలు రోడ్డుపై గొర్లను నిలిపి వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెలు పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంతో ఆరు నెలల క్రితం డీడీలు చెల్లించినా పంపిణీ చేయడం లేదన్నారు. ఆంక్షలు లేకుండా ప్రతి లబ్ధిదారుడికి నేరుగా రూ.1.75 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన గొర్రెల కాపర్లకు ప్రభుత్వం రూ.3 వేల పింఛన్‌తో పాటు ప్రమాదవశాత్తు చనిపోయిన వారి కుటుంబానికి రూ.6 లక్షల బీమా కల్పించాలన్నారు. జీవాలను మేతకు తీసుకెళ్లడానికి ప్రతి గ్రామంలో ప్రభుత్వం 20 ఎకరాల భూమిని కొనుగోలు చేయడంతో పాటు గొర్రెల షెడ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న భూంపల్లి పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో శాంతించారు. కార్యక్రమంలో జిల్లా గొల్ల కురుమల సెల్ అధ్యక్షుడు గోపాల్ యాదవ్, సంఘం జిల్లా అధ్యక్షుడు యాదమల్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజు తదితరులు పాల్గొన్నారు. సుమారు గంట పాటు సాగిన ఆందోళనతో సిద్దిపేట రామాయంపేట రహదారికి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

క్లుప్తంగా

పదవీకాలం పొడిగింపు


శ్రీహరి యాదవ్‌

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉమ్మడి మెదక్‌ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి యాదవ్‌ పదవీ కాలం మరో సంవత్సరం పొడిగిస్తూ పశు సంవర్థక శాఖ ప్రత్యేక కార్యదర్శి అధార్‌ సిన్హా గురువారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 27తో శ్రీహరి యాదవ్‌ పదవీకాలం ముగియనుంది.

ఏఐవీఎఫ్‌ జిల్లా సలహాదారుడిగా..


జానకీరాములు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన వెగ్గలం జానకీ రాములును ఆల్‌ ఇండియా విశ్వకర్మ ఉమెన్‌ అండ్‌ యూత్‌ ఫెడరేషన్‌(ఏఐవీఎఫ్‌) జిల్లా సలహాదారుడు, మండల అధ్యక్షుడిగా నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనర్సింహ సేనాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనర్సింహసేనాచారి, జాతీయ వ్యవస్థాపకులు జెన్‌కుమార్‌లకు కృతజ్ఞతలు అని తెలిపారు.

కుమారుడి అనుమానాస్పద మృతిపై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్‌: కుంటలో పడి కుమారుడి మృతి చెందడంపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. మండల పరిధిలోని ఇస్నాపూర్‌కు చెందిన దిలీప్‌ రెడ్డి(35) బుధవారం తన స్నేహితుడు ఫోన్‌ చేశాడని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అదేరోజు సాయంత్రం ఇస్నాపూర్‌ కుంటలో శవమై కనిపించాడు. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుమారుడి మృతిపై అతని స్నేహితునిపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ..


కుమార్‌ (ఫైల్‌)

మనోహరాబాద్‌(తూప్రాన్‌): అంత్యక్రియలకు హాజరై వస్తుండగా లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌కు చెందిన ఎర్ర కుమార్‌ (36) కొన్నేళ్లుగా మౌలాలిలో స్క్రాబ్‌ దుకాణం నడుపుతున్నాడు. గురువారం స్వగ్రామానికి చెందిన బంధువు అంత్యక్రియలకు కుమార్‌ హాజరయ్యాడు. స్కూటీపై తిరిగి ఇంటికి వస్తుండగా మనోహరాబాద్‌ మండలం కాళ్ళకల్‌ శివారులో అదుపు తప్పి కిందపడ్డాడు. వెనుకనుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు.

ఆర్టీసీ బస్సులో నుంచి కిందపడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్‌: ఆర్టీసీ బస్సులో నుంచి కింద పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన సుధీష్‌ సూర్య(39) బతుకుదెరువు కోసం జహీరాబాద్‌ వచ్చి మేస్త్రి పనులు చేస్తున్నాడు. బుధవారం పని పై పటాన్‌చెరుకు వెళ్లాడు. తిరిగి రావడానికి నవపాన్‌ సమీపంలో జోగిపేట వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కాడు. ముత్తంగి ఓఆర్‌ఆర్‌ బ్రిడ్జి సమీపంలోకి రాగానే డ్రైవర్‌ బస్సును అతివేగంగా నడపడంతో సుధీష్‌ కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అతన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం తరలించారు. మృతుడి భార్య విద్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

WANTED

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్‌/ ఫుల్‌టైమ్‌గా వర్క్‌ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926 [G-801113]

■ హరేకృష్ణ హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K Ph: 9640468899/ 9640258899 [H-189336]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ ఎకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌/ డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అభాగ్యులకు అండగా..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 'మిషన్‌ వాత్సల్య' పథకం అమలు
- తల్లిదండ్రులు లేని పిల్లలు అర్హులు
- ఒక్కో చిన్నారికి రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం
- మెదక్‌ జిల్లాలో భారీగా దరఖాస్తులు


మెదక్‌లోని మాతాశిశు సంరక్షణ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

మెదక్‌: చిన్న వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన వారి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్‌ వాత్సల్య పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఆర్థిక కష్టాలతో విద్య, వైద్యం కోసం ఇబ్బంది పడుతున్న వారికి ఈ పథకం ఆసరా కానుంది. ఈ పథకం కింద కుటుంబ పెద్ద కోల్పోయిన పిల్లలకు నెలకు రూ.4 వేలు అందుతాయి. ఈ పథకాన్ని గతేడాది ప్రవేశపెట్టగా, రెండు మాసాల నుంచి అమల్లోకి వచ్చింది. ఈ పథకానికి మెదక్‌ జిల్లాలో మంచి స్పందన లభిస్తోంది. అంగన్‌వాడీ టీచర్ల ద్వారా దీని గురించి అర్హులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో అర్హులైన పిల్లలను తీసుకుని దరఖాస్తు చేసుకోవడానికి జిల్లాలోని బాలల సంరక్షణ శాఖ కార్యాలయానికి తరలివస్తున్నారు.

ప్రతినెలా రూ.4 వేల ఆర్థిక సాయం

దేశంలో తల్లి లేదా తండ్రి కోల్పోయిన ప్రతి చిన్నారికి సరైన సంరక్షణ, విద్య అందేలా చూడటమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మిషన్‌ వాత్సల్య పథకానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న పిల్లలకు మూడేళ్ల వరకు నెలకు రూ.4 వేల చొప్పున తల్లి, లేదా తండ్రితో కూడిన బ్యాంక్‌ జాయింట్‌ ఖాతాలో మూడేండ్ల వరకు డబ్బును జమ చేయనున్నారు. ఏడాదికి రూ.48 వేల చొప్పున మూడేండ్లలో ఒకొక్కరికీ రూ.1.44లక్షలు అందించనున్నారు. ఈ మొత్తంలో 60 శాతం(రూ.2,400) కేంద్ర ప్రభుత్వం, 40 శాతం(రూ.1,600) రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుండగా పథకం పూర్తి పర్యవేక్షణను ఐసీడీఎస్‌, స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు ప్రభుత్వం అప్పగించింది. గురుకుల పాఠశాలలో చదివే పిల్లలు ఈ పథకానికి అర్హులు కాదు. 30 రోజులు వరుసగా పాఠశాలకు వెళ్లని పిల్లలు ఈ పథకానికి అనర్హులు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.72,000, పట్టణ ప్రాంతాలలో రూ.96,000లకు మించరాదు.

పథకానికి అర్హులు వీరే..

తల్లిదండ్రులు ఇద్దరినీ పోగొట్టుకున్న పిల్లలకు ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఈ పథకానికి 6 నుంచి 18 ఏళ్ళలోపు అనాథ పిల్లలందరూ అర్హులే. ఒక కుటుంబంలో ఇద్దరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. విడాకులు తీసుకున్న, ఒంటరిగా ఉన్న తల్లిదండ్రుల పిల్లలు, కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోయిన తల్లిదండ్రుల పిల్లలు, ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు, పునరావాసం అవసరమైన వారి పిల్లలు మిషన్‌ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు ఫారాలు పొందొచ్చు. అనాథలు ఉంటే వారి తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రం, చిన్నారుల విద్యార్హతలు, కుల, ఆదాయ, నివాస పత్రాలతోపాటు పిల్లల బ్యాంక్‌ ఖాతా, లేదంటే తల్లి, తండ్రి, సంరక్షకుడి బ్యాంక్‌ జాయింట్‌ ఖాతా, ఆధార్‌, రేషన్‌కార్డు ఆన్‌లైన్‌ కాపీ, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలి.

స్పందన బాగుంది

మిషన్‌ వాత్సల్య యోజన పథకానికి స్పందన బాగుంది. నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబాల పిల్లల సంరక్షణ, విద్యను అందించేందుకు ఈ పథకం దోహదం చేస్తుంది. 6 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న అనాథ పిల్లలు అందరూ అర్హులే.

– కరుణశీల, బాలల సంరక్షణ అధికారి, మెదక్‌

ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న వాసుదేవ రెడ్డి

హుస్నాబాద్‌: పట్టణ శివారులోని పోతారం (ఎస్‌) శుభం గార్డెన్‌లో అక్టోబర్‌ 1న నిర్వహించే హుస్నాబాద్‌ నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల కోఆపరేటివ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నియోజకవర్గస్థాయి దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. అనంతరం క్యాంప్‌ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం గురించి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌తో చర్చించారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శీలం రాజిరెడ్డి, మెడబోయిన వెంకటేష్‌, సరిత, పద్మ, రాజు, సంపత్‌, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మనస్తాపంతో ఇద్దరి ఆత్మహత్య

పిల్లలు పుట్టడం లేదని..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పిల్లలు పుట్టడం లేదని వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పాత రామచంద్రాపురంలో గురువారం జరిగింది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్‌ జిల్లా అన్నారం గ్రామానికి చెందిన రేణుక (20)కు ఆమె మేనబావ వెంకటేష్‌తో 2018లో వివాహం జరిగింది. ఆ దంపతులు రామచంద్రాపురంలో నివాసం ఉంటున్నారు. ఐదేళ్లుగా పిల్లలు పుట్టడం లేదని రేణుక బాధపడుతూ ఉండేది. ఈ నెల 27న ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు నగేష్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో బాధపడుతూ..


యశోద (ఫైల్‌)

రామాయంపేట(మెదక్‌): అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం సాయంత్రం రామాయంపేటలో వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రంజిత్‌ తెలిపిన వివరాలు. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎర్ర యశోద(45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె హన్మ చెరువులో దూకింది. స్థానికులు గమనించి యశోదను చెరువులో నుంచి బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె చిన్న కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిద్దిపేటలో చాగంటి ప్రవచనాలు

సెప్టెంబర్‌ 30 నుంచి మూడు రోజులపాటు కార్యక్రమాలు


చాగంటి ప్రవచనాల పోస్టర్‌ ఆవిష్కరణలో కమిటీ సభ్యులు

సిద్దిపేటజోన్‌: ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు సిద్దిపేటకు రానున్నారు. మంత్రి హరీశ్‌రావు ఆహ్వానం మేరకు పట్టణంలో మూడు రోజుల పాటు ప్రవచన సందేశాన్ని ఇవ్వనున్నారు. సెప్టెంబర్‌ 30 నుంచి అక్టోబర్‌ 2 వరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. దీనికి సంబంధించిన పోస్టర్లు గురువారం సిద్దిపేట ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు నందిని శ్రీనివాస్‌, రావిచెట్టు హనుమాన్‌ దేవాలయ అర్చకులు కృష్ణమాచార్యులు మాట్లాడుతూ... సిద్దిపేట లో చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. భారత, రామాయణ, భాగవత ఇతిహాసాలు, వేదాల సారాన్ని, పురాణ ఇతిహాసాల్ని అనేక కోణాల్లో అధ్యయనం చేసిన చాగంటి వాటి సారాన్ని సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రసంగాలు చేస్తుంటారని పేర్కొన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6–30నుంచి 8–30 వరకు చాగంటి ప్రవచనాలు ఉంటాయని, ఈ సందర్భంగా సాయంత్రం 5 గంటల నుంచే వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు, పోలీస్‌ కమిషనర్‌ శ్వేత ఆదేశాల మేరకు ఏసీపీ సురేందర్‌ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో గంప శ్రీనివాస్‌, కూర శ్రీనివాస్‌, అనిల్‌ శ్రీనివాస్‌, ఎల్లేషం, శ్రీకాంత్‌, మధుసూదన్‌ పాల్గొన్నారు.

కేసీఆర్‌ కాలనీలో చోరీకి యత్నం

రామాయంపేట(మెదక్‌): రామాయంపేటలోని కేసీఆర్‌ కాలనీలో గురువారం సాయంత్రం అదే కాలనీకి చెందిన కొందరు చోరీకి యత్నించారు. ఈ విషయమై కాలనీవాసులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నలుగురిపై కేసు నమోదు చేశారు. డబుల్‌ బెడ్‌ రూంవద్ద తాళాలు పగులగొట్టిన ఇళ్లను ఎస్‌ఐ రంజిత్‌ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాలకు అలవాటు పడి..

- లైటర్‌ తుపాకీతో బెదిరించి చోరీ
- కేసును ఛేదించిన సిద్దిపేట త్రీటౌన్‌ పోలీసులు
- అదుపులో నిందితుడు

సిద్దిపేటఅర్బన్‌: పట్టణంలో ఈ నెల 14న జరిగిన దోపిడీ కేసును సిద్దిపేట త్రీటౌన్‌ పోలీసులు ఛేదించారు. ప్రగతినగర్‌లోని ఆత్మీయ అపార్ట్‌మెంట్‌ నాలుగో అంతస్తులో ఇంట్లోకి దూరిన దుండగుడు నకిలీ పిస్టల్‌తో బెదిరించి బంగారం నగలు దోచుకెళ్లిన విషయం తెలిసిందే. బాధితుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. సిద్దిపేట ఏసీపీ సురేందర్‌ రెడ్డి, త్రీటౌన్‌ సీఐ భాను ప్రకాష్‌, పోలీస్‌ కానిస్టేబుల్స్‌తో ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. ఈ బృందం కేసును పరిశోధన చేసి నిందితుడు దుబ్బాక మండలం పెద్ద చీకోడ్‌కు చెందిన చాకలి రవి అలియాస్‌ పున్న రవిగా గుర్తించారు. నిందితుడిని అతని స్వగ్రామంలో ఉన్నాడని తెలుసుకుని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్టు ఒప్పుకున్నాడు. అతని నుంచి బంగారు గొలుసులు, గాజులు స్వాధీనం చేసుకున్నారు. బతుకుదెరువు కోసం నిందితుడు గతంలో సౌదీ వెళ్లాడు. కరోనా సమయంలో స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో చెడు వ్యసనాలకు బానిసై డబ్బు సులభంగా సంపాదించాలనే ఉద్దేశంతో జూన్‌ నెలలో మీషో యాప్‌ ద్వారా ఒక లైటర్‌ పిస్టల్‌ కొనుగోలు చేశాడు. తన సొంత అన్న శ్రీనివాస్‌ ప్రగతి నగర్‌ ఆత్మీయ అపార్ట్‌మెంట్‌ వాచ్‌మెన్‌గా పనిచేస్తుండడంతో తరచూ అక్కడికి వెళ్లేవాడు. ఈ సందర్భంలో అపార్ట్‌మెంట్‌లో నివసించే వారిని గమనిస్తుండేవాడు. 4వ అంతస్తులో ఇద్దరు డాక్టర్స్‌, ఒక పెద్దావిడ ఉండడం చూశాడు. ముందుగా అనుకున్న ప్రకారం తన అన్నకు తెలియకుండా అపార్ట్‌మెంట్‌లోకి వచ్చి ఎవరూ లేని సమయంలో పెద్దావిడ ఉండే ఇంట్లోకి చొరబడ్డాడు. లైటర్‌ పిస్టల్‌తో బెదిరించి బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. నిందితుని నుంచి లైటర్‌ పిస్టల్‌ (పిస్టల్‌ గ్యాస్‌ గన్‌), బంగారు లాంగ్‌ చైన్‌, బంగారు చిన్న చైన్‌, బంగారు లాకెట్‌, రెండు బంగారు గాజులు, పల్సర్‌ బైక్‌, రెండు సెల్‌ ఫోన్లు, మారు వేషం కోసం ఉపయోగించిన వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

అప్పులు చేసి మధ్యాహ్నం వంట

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ఆందోళన


ఐఓసీ ఎదుట నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

గజ్వేల్‌రూరల్‌: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వండిపెడుతున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని ఐఓసీ(ఇంటిగ్రేటెడ్‌ ఆఫీస్‌ కాంప్లెక్స్‌) ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులతో నిరసన తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులు చేసి వంటలు చేస్తున్నారన్నారు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతేడాది అక్టోబర్‌ నుంచి ఇప్పటి వరకు బిల్లులు, జీతాలు రాలేవని.. ప్రభుత్వం ప్రకటించిన జీఓ నంబర్‌ 8 అమలు చేసి ఏరియర్స్‌ను వెంటనే ఇవ్వాలన్నారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్‌ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌ చేస్తున్నామన్నారు. అదే విధంగా గుర్తింపు కార్డులు, కాటన్‌ యూనిఫాం ఇవ్వాలని, పాఠశాలల్లో వంటగదుల నిర్మాణం చేపట్టడంతో పాటు పాత్రలను అందించాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్‌లక్ష్మీ, సభ్యులు భాషయ్య, భాగ్యమ్మ, లక్ష్మీ, రాణి, యాదమ్మ, అమృత, కళ్యాణి, శ్యామల, కవిత, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఆలయ మాజీ చైర్మన్‌ రహస్య సమావేశం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ మాజీ చైర్మన్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి తన అనుచరులతో కలసి జగదేవ్‌పూర్‌ మండలం కొండపోచమ్మ ఆలయం వద్ద గురువారం రహస్య సమావేశం ఏర్పాటు చేశారు. 30 మంది సమావేశంలో పాల్గొన్నారు. తన వెంటే మీరంతా ఉండాలని, మీ పూర్తి బాధ్యత తనదేనని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి గీస భిక్షపతి ప్రధాన అనుచరుడిగా ఉండేవారు. జనగామ టికెట్‌ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కేటాయిస్తున్నట్లు అధిష్టానం ప్రకటించడంతో భిక్షపతి రూటు మార్చినట్లు తెలుస్తోంది. ఇటీవల పల్లా ఏర్పాటు చేసిన రహస్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. అప్పటినుంచి పల్లా వద్ద తాను ప్రత్యేక మార్కును చూపించేందుకు తన అనుచరులతో రహస్య సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం.

సమన్వయంతో పనిచేయాలి

జెడ్పీ చైర్‌పర్సన్‌ రోజాశర్మ


రవీందర్‌రెడ్డిని అభినందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ రోజాశర్మ

సిద్దిపేటజోన్‌: ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేందుకు సమన్వయంతో పనిచేద్దామని, ఉద్యోగులకు అండగా ఉంటానని జెడ్పీ చైర్‌పర్సన్‌ రోజాశర్మ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో గురువారం తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్‌ మినిస్టీరియల్‌ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ జిల్లా శాఖ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కె.రవీందర్‌ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు నూతన కమిటీ సభ్యులు రోజాశర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు.

నూతన కమిటీ నియామకం

అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్రారెడ్డి, అసోసియేట్‌ అధ్యక్షుడిగా రాంప్రసాద్‌, రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యులుగా గౌస్‌, ప్రవీణ్‌, ప్రభాకర్‌, ముతాలిఫ్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి నందకుమార్‌, నల్గొండ, యాదాద్రి, భువనగిరి జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సంగారెడ్డి అర్బన్‌: పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. టౌన్‌ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలు. సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట గుర్తుతెలియని వ్యక్తి స్పృహతప్పి పడి ఉన్నాడు. స్థానికులు గమనించి ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆచూకీ తెలిసినవారు 8712656718 నెంబర్‌లో సంప్రదించాలని సీఐ తెలిపారు.

సీతాఫలాలు అమ్మడానికి వచ్చి..

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


కొమిని బాయి (ఫైల్‌)

పాపన్నపేట(మెదక్‌): సీతాఫలాల అమ్మడానికి వచ్చిన ఓ గిరిజన మహిళ రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్‌ మండలం కడీల బాయి తండాకు చెందిన కున్సోత్‌ కొమిని బాయి (45) భర్త ఫూల్‌సింగ్‌తో కలిసి సీతాఫలాలు అమ్మడానికి సోమవారం సాయంత్రం పాపన్నపేట వస్తుంది. స్థానిక ఎస్‌ఆర్‌ బంక్‌ ఎదుట ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ వ్యక్తి వీరిని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కొమిని బాయికి తీవ్ర గాయాలయ్యా యి. ఆమెను మెదక్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

సిద్దిపేటఅర్బన్‌: మండల పరిధి ఎన్సాన్‌పల్లి శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడి చేశారు. గ్రామానికి చెందిన ఆరుగురిని అదుపులో తీసుకున్నారు. వారి నుంచి రూ. 6 వేలు నగదు, 5 బైకులు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని సిద్దిపేట త్రీటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో అప్పగించగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ భాను ప్రకాష్‌ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం

భార్య కనిపించడం లేదని..

పటాన్‌చెరు టౌన్‌: భార్య అదృశ్యం పై భర్త పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు. ఛత్తీస్‌గఢ్‌కి చెందిన అజయ్‌కుమార్‌ భార్య రాణితో కలిసి నెల క్రితం పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండకు వచ్చాడు. నవ్య కన్‌స్ట్రక్షన్స్‌లో భార్యాభర్తలిద్దరూ మేస్త్రి పని చేస్తున్నారు. ఈ నెల 26వ తేది మధ్యాహ్నం అజయ్‌ కుమార్‌ భార్య చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్‌ చేస్తే స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. గురువారం భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్‌కు వెళ్తున్నానని చెప్పి..


చంద్రారెడ్డి(ఫైల్‌)

జిన్నారం(పటాన్‌చెరు): హోటల్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాలు. గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామానికి చెందిన చంద్రారెడ్డి వ్యవసాయం చేస్తుంటాడు. ఈ నెల 23వ తేదీన ఉదయం హోటల్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం వెతికినా ఆచూకీ లభించ లేదు. భర్త అదృశ్యంపై భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

దుబ్బాకటౌన్‌: సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని రెడ్డి ఫంక్షన్‌హాలులో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగే కార్యక్రమాలకు మా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గన్నె వనిత భూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.